# చెప్పినట్టే అభివృద్ధి చేశాం

**సూర్యాపేట 2014కు ముందు ఎట్లుండే.. ఇప్పుడెట్లయ్యింది ?**

- ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం..
- కాంగ్రెస్, బీజేపోళ్లు చేసినవేమైనా కనబడుతున్నయా..?
- కాంగ్రెస్, బీజేపీ హామీలు నెరవేరుతయన్న నమ్మకం ఉందా?
- పదేండ్లలో సూర్యాపేటను సుందరంగా తీర్చిదిద్దుకున్నం
- మంత్రి, బీఆర్ఎస్ సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో రోడ్ షో.. పలు సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు
- మార్నింగ్ వాకర్స్‌తో మాటామంతి



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన దివ్యాంగులు



సూర్యాపేటలో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, నవంబర్ 25 : ఉమ్మడి పాలనలో అన్ని విధాలుగా ఆగమైన సూర్యాపేట.. 2014లో ఓట్లేయ్యక ముందు ఎట్ల ఉన్నదో.. బీఆర్ఎస్ పార్టీకి ఓట్లేసి గెలిపించినంక ఎంతటి అభివృద్ధి చెందిందో ప్రజలంతా కండ్లారా చూస్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ రూపొందించిన మ్యానిఫెస్టోతో పాటు తాను సూర్యాపేట కోసం ప్రత్యేకంగా ఇచ్చిన మ్యానిఫెస్టోలోని హామీలన్నీ అభివృద్ధి రూపంలో కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నో ఏండ్లు పాలించిన కాంగ్రెస్‌తోపాటు బీజేపీ నాయకులు ఇక్కడి ప్రాంతాలకు చేసిన అభివృద్ధి ఏమన్నా కనబడుతున్నదా.. అటువంటి పార్టీలు కొత్తగా ఇచ్చే హామీలు నెరవేరుతాయన్న నమ్మకముందా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు నీచ రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలకు ఓటుతో తగిన బుద్ధి చెప్పి.. నిరంతర అభివృద్ధి పాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సూర్యాపేటలో శనివారం తెల్లవారుజామున మంత్రి జగదీశ్‌రెడ్డి పారిశుధ్య కార్మికులు, మార్నింగ్ వాకర్స్‌తో మాటామంతి నిర్వహించారు. బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించేందుకు ఏర్పాటు చేసుకున్న దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. అనంతరం పట్టణలో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ 2014, 2018లో బీఆర్ఎస్ పార్టీకి మీరు వేసిన ఓటు వల్లే రూ.200 పింఛన్ రూ.2వేలు అయ్యిందని, రేపు రూ.5వేలకు పెంచుతామని చెప్పారు. రూ.500 ఉన్న దివ్యాంగుల పింఛన్ రూ.3వేలు చేశామని, దాన్ని 6వేల రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అడగకుండానే ఆడబిడ్డ పెళ్లికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పేరిట మొదట రూ.50 వేలు అందించి లక్ష పదహార్లకు పెంచామన్నారు. రైతుబీమా తరహాలో కేసీఆర్ బీమా పేరుతో అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల సాధారణ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందిస్తామని, సౌభాగ్యలక్ష్మి పేరిట అర్హులైన మహిళలకు నెలకు రూ.3వేల గౌరవ వేతనం ఇస్తామని చెప్పారు. రైతుబంధు రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంపు, రూ.400కే గ్యాస్ సిలిండర్ వంటి అనేక హామీలను సీఎం కేసీఆర్ ప్రకటించారని తెలిపారు. సూర్యాపేటకు స్వతహాగా మ్యానిఫెస్టో విడుదల చేయనున్నట్లు చెప్పారు. కనీసం 3వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించేలా ఐటీ హబ్‌ను విస్తరిస్తామన్నారు. ఇండస్ట్రియల్ పార్కు, డ్రై పోర్ట్‌లు ఏర్పాటు చేసి వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 2014లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల కంటే ఎక్కువే అభివృద్ధి జరిగిందని, అదే తరహాలో సూర్యాపేటలో ఇచ్చిన హామీల కంటే అదనంగా చేశామని చెప్పారు. 2014కు ముందు ఉన్న సిండికేట్ దందాలు, రౌడీ రాజకీయాలను మార్చి ప్రశాంత వాతావరణాన్ని పెంచుకున్నామన్నారు. ఒక్క చాన్స్ ఇవ్వాలని తిరుగుతున్న అభివృద్ధి నిరోధకులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాల అభివృద్ధితో సూర్యాపేటను సుందర పట్టణంగా తీర్చిదిద్ది.. పదేండ్ల పాలనలోనే వందేండ్ల అభివృద్ధితో తెలంగాణను యావత్ దేశానికే ఆదర్శంగా నిలిపిన బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ప్రజలంతా మద్దతు ప్రకటించి బ్రహ్మరథం పట్టారు. వేలాదిగా వచ్చిన దివ్యాంగులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని పూర్తి మద్దతు ప్రకటించారు. రోడ్ షోలో వాడవాడలా మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు.

కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, పార్టీ నాయకులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్, బండారు ధనుంజయ్‌గౌడ్, గండూరి ప్రకాశ్, షేక్ నయీమ్, మల్లారెడ్డి, రాజేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సూర్యాపేటలో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# సునీతమ్మకు 50వేల మెజారిటీ ఇవ్వండి

- గుట్టలో 100 సీట్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల
- గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ, టూరిజం హబ్
- మూడుచింతలపల్లి నుంచి వడపర్తి వరకు డబుల్ రోడ్డు
- ఎన్నికల వేళ మోసపోతే గోసపడ్తం..
- కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు తప్పవు
- చీకటి మామిడి రోడ్ షోలో మంత్రి హరీశ్‌రావు



బొమ్మలరామారం మండలం చీకటిమామిడిలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఆలేరు అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

యాదగిరిగుట్ట, నవంబర్ 25 : కరువు తాండవం చేసిన ఆలేరు నియోజకవర్గాన్ని పదేండ్లలో అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపాం. ఈ ప్రాంతానికి ఎంతో చేశాం. ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. రాబోయే ఐదేండ్లలో ఆలేరును అద్భుతంగా అభివృద్ధి చేస్తాం. ఇది నా హామీ అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఇప్పటికే 80 శాతం అభివృద్ధి పూర్తయ్యింది. ఈసారి చెల్లెమ్మ సునీతను 50 వేల మెజార్టీతో గెలిపిస్తే.. ఆలేరు అభివృద్ధి బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. బొమ్మలరామారం మండలం చీకటిమామిడిలో బీఆర్ఎస్ ఆలేరు అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్‌తో కలిసి శనివారం రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే హామీ ఇచ్చారని, రానున్న రోజుల్లో ఆలేరును రెవెన్యూ డివిజన్ చేసుకుందామన్నారు. యాదగిరిగుట్టలో 100 సీట్ల ఎంబీబీఎస్ మెడికల్ కళాశాల నిర్మించాల్సి ఉందన్నారు. దాంతో 500 పడకల ఆస్పత్రి అందుబాటులోకి రానున్నదని తెలిపారు. ఆలేరు నియోజకవర్గానికి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ, టూరిజం హబ్ నిర్మించాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రభుత్వ అనుమతులు మంజూరయాయని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటుకాగానే పనులను ప్రారంభిస్తామన్నారు. ఎన్నికల వేళ మోసపోతే గోస పడతామని అన్నారు. ఎన్నికలంటే మూడు రోజుల పండుగ కాదని, ఐదేండ్ల భవిష్యత్ అని తెలిపారు. పదేండ్లలో ఆలేరు నియోజకవర్గానికి సాగుజలాలు అందించామన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు సాగుజలాలు అందించినట్లు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ప్రపంచమే గర్వించేలా సీఎం కేసీఆర్ గొప్పగా పునర్నిర్మించినట్లు చెప్పారు. ఏనాడైనా ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న సోయి కాంగ్రెసోళ్లకు వచ్చిందా? అని ప్రశ్నించారు. బొమ్మలరామారం మండలంలోని మూడుచింతలపల్లి నుంచి వడపర్తి వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తామన్నారు. 2001 నుంచి గొంగిడి సునీత ఉద్యమ నేత సీఎం కేసీఆర్ వెంట నడిచిందన్నారు. ఇలాంటి నాయకురాలికి ఆలేరు ప్రజలు రెండుసార్లు అండగా నిలిచారని, మరోసారి గెలిపించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## 28న రైతుబంధు నగదు జమ..

రైతులకు రైతుబంధు ఇచ్చి దుబారా చేస్తున్నారని రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారని, రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారని వక్రీకరించినట్లు ఆరోపించారు. 24 గంటల కరెంటు వద్దు.. 3 గంటలు సాలు అంటున్నారు. ఇలాంటి కాంగ్రెస్ పార్టీకి పొరపాటున ఓటేస్తే కరెంటు కష్టాలు తప్పవని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రైతుబంధు ఆపాలని కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఫిర్యాదు చేసిందన్నారు. కానీ, ధర్మం గెలిచిందని, రైతుబంధు పంపిణీకి ఈసీ అనుమతి ఇచ్చిందన్నారు. నేడు, రేపు బ్యాంకులకు సెలవులని మంగళవారం ఉదయం నుంచి రైతు ఖాతాల్లో రైతుబంధు నగదు జమ చేస్తామని చెప్పారు. ఒక్క చాన్స్ అంటున్న కాంగ్రెస్‌కు అవకాశమిస్తే ఆగం కావడం ఖాయమన్నారు. తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ చేతిలో ఉంటేనే సురక్షితమని చెప్పారు. రిస్క్ వద్దు.. కారు ముద్దు అని, ఎన్నో మంచి పనులు చేసిన కేసీఆర్‌ను సాదుకుందామా? చంపుకుందామా? ప్రజలు తేల్చుకోవాలన్నారు.

## చీకడిమామిడి గులాబీమయం

చీకటిమామిడి గ్రామంలో రోడ్ షో నిర్వహించిన మంత్రి హరీశ్‌రావుకు మహిళలు బొట్లు పెట్టి మంగళహారతులతో స్వాగతం పలికారు. జనం పెద్ద సంఖ్యలో రావడంతో ప్రధాన కూడళ్లు కిక్కిరిసిపోయాయి. గ్రామంలోని అన్ని విధులు గులాబీమయంగా మారిపోయాయి. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, ఎంపీపీ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మరోసారి గెలిపించండి.. మరింత అభివృద్ధి చేస్తా

- బీఆర్ఎస్ ఆలేరు అభ్యర్థి, ప్రభుత్వ విప్ సునీతామహేందర్‌రెడ్డి

బొమ్మలరామారం, నవంబర్ 25 : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోసారి గెలిపించండి.. మరింత అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో మంత్రి హరీశ్‌రావుతో కలిసి శనివారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాగానే మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని నెరవేరుస్తామని చెప్పారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని, మరింత అభివృద్ధి కావాలంటే బీఆర్ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.